సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి బాబూ..

సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏమాయ్యాయి బాబూ.. అని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రశ్నించారు.


8లో



27, 28 తేదీల్లో కొబ్బరి జాతీయ సదస్సు

కొబ్బరి రైతుల సమస్యలపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు బీకేఎస్ సభ్యుడు జలగం కుమారస్వామి తెలిపారు.

2.34లక్షల క్యూసెక్కుల జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం 2,34,613 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. కాటన్ బ్యారేజ్ వద్ద 10.60 అడుగులకు నీటి మట్టం చేరింది. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 12,100 క్యూసెక్కుల నీటిని వదిలారు.



సమాజంలో మార్పు రావాలి



కోల్ కతా ఘటన చాలా బాధాకరం. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు రూపొందిస్తున్నా ఆచరణలో కనిపించడం లేదు. మంచి, చెడును అమ్మాయిలకే కాదు అబ్బాయిలకు చెప్పడం మన ఇంటి నుంచే ప్రారంభం కావాలి. అంతిమంగా సమాజంలో మార్పు వస్తేనే అమ్మాయిలకు భద్రత సాధ్యం. ఆస్పత్రుల్లోనూ మహిళా సిబ్బందికి భద్రతతో పాటు సౌకర్యాలను కల్పించాలి. ప్రధాన ఆస్పత్రుల వద్ద రాత్రి వేళల్లో పోలీసులు ఉండే విధంగా చూడాలి.

– డాక్టర్ అనుసూరి పద్మలత, రాజమహేంద్రవరం

హెల్మెట్.. శిరోభారం కారాదు



హెల్మెట్ లేకుండా ప్రమాదకరంగా డ్రైవింగ్

- ప్రాణ రక్షణ ప్రథమ కర్తవ్యం
- వాహన చోదకుల్లో అవగాహన శూన్యం
- నిబంధనలు పట్టించుకోని యువత
- వారోత్సవాలకే పరిమితమవుతున్న అధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రోడ్డుపై వెళ్తున్న సమయంలో ఏదో మూల నక్కి ఉండే పోలీసు.. రవాణా శాఖాధికారులు ఆ వాహనాన్ని తనిఖీ చేయడం చూస్తుంటాం. ఆ సమయంలో వాహనం నడుపుతున్న వ్యక్తి అక్కడ నిలబెట్టి వాహనంతో పాటు అతనిని ఫొటో తీసి ఆన్‌లైన్‌లో జరిమానా విధిస్తాడు. వాహనచోదకుడు ఆ సిబ్బందిని బతిమాలుకోవడం, కాళ్లవేళ్లా పడడం చూస్తుంటాం. అంతేకానీ చేసిన తప్పిదమేంటి, మరో సారి చేయకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలేంటి అనే అవగాహన కల్పించే ప్రయత్నం ఆ అధికారుల నుంచి మచ్చుకైనా కనిపించదు. ప్రజల రహదారి భద్రతపై వారికి ఉన్న నిబద్ధతకు ఇది ఉదాహరణ మాత్రమే.

ఇది జిల్లాలో కొందరు ద్విచక్ర వాహన చోదకుల వద్ద లైసెన్స్ ఉండదు. రహదారి నియమాలు తెలియవు.. ఇష్టమొచ్చినట్టు ముందు వాహనాన్ని అధిగమిస్తూ సర్రున దూసుకుపోవడాలు.. సబ్ రోడ్ల నుంచి సడన్‌గా మెయిన్ రోడ్డులోకి వచ్చేయడాలు.. ఈ సమయంలో ఆ మెయిన్ రోడ్డులో ఎవరైనా వస్తున్నారా లేదా అని ఆగి వచ్చే ఆలోచన లేకపోవడం.. అదే చిన్న వాహనమైతే అతనికి ప్రమాదం.. ఏ లారీయో వ్యానో అయితే ఇలా ముందుచూపు లేకుండా వచ్చేసిన ఆ వాహన చోదకుడికి ప్రమాదం. బాధ్యత తెలియని కుర్రకారు.. బండి చేతిలో ఉంటే ఎక్సిలేటర్‌ని రైరయ్యిన రేజ్‌చేసి జిగ్‌జాగ్ డ్రైవింగ్‌తో సజావుగా వెళ్లేవారిని భయభ్రాంతులకు గురిచేసే ఆకతాయిలు.. ఆపి మందలిద్దామంటే ఎదురుచేసి గాయపరిచే ఫాల్స్ హీరోయిజం.. సమాజంలో వాహన చోదకులు ఇలా ఉంటే అదుపు చేయాల్సింది ఎవరు? ఇలా వాహన చోదకులు నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా ప్రయాణాలు చేస్తూ వారి ప్రాణలతో పాటు మరొకరి ప్రాణాలతో చెలగాటమాడుతుంటే అడ్డుకునేదెవరు? ఆనందంగా సాగాల్సిన జీవన ప్రయాణంలో అంతులేని విషాదం నింపుకొనేవారు కొందరు.. అవతలివారి జీవితాలను శూన్యం చేసేవారు మరొకరు. అయిన వారిని కోల్పోయిన కుటుంబాలు జీవితాంతం దుఃఖసాగరంలో మునిగిపోతున్నాయి. ఎవరి వ్యవహార శైలి ఎలా ఉన్నా ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారిలో వాహనం నడిపేటపుడు కనీస బాధ్యతగా హెల్మెట్ ధరించకపోవడం ప్రధాన లోపంగా కనిపిస్తోంది. ఇటీవల కేంద్ర రహదారి భద్రతా సమావేశంలో ప్రమాద మరణాలు తగ్గించాలంటే హెల్మెట్ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జరిగే రహదారి ప్రమాదాల్లో ఎక్కువ శాతం మృతి చెందుతున్నవారిలో ద్విచక్ర వాహన చోదకులే అధికం. జిల్లాలో లక్షల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు ఉండగా ఇందులో అధిక సీసీ ఉన్న వాహనాలను నడిపేవారు 60 శాతానికి పైగా యువతే ఉన్నారు. ఎక్కువ మందికి నిర్ణీత వయసు లేకపోవడం, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా రహదారి నిబంధనలపై కనీస అవగాహన కూడా కలిగి ఉండటం లేదని తనిఖీల్లో తెలుస్తోంది. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలపై గారం చూపిస్తూ వారి మృతికి కారణం అవుతున్నారు. వారి కోరిక మేరకు 350 సీసీ వాహనాలను కూడా కొని ఇస్తుండటంతో వాటిపై అత్యంత వేగంగా వెళుతూ అత్యుత్సాహం చూపుతూ ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్నారు.

హెల్మెట్ ధరించేది తక్కువ మందే..

2019 లోనే శిరస్త్రాణం తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిబంధన తీసుకువచ్చినా స్థానిక రవాణాశాఖ, పోలీసు యంత్రాంగాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. హెల్మెట్ ధారణపై ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు రాజకీయ ఒత్తిళ్లతో శిరస్త్రాణం తప్పనిసరి నిబంధనను పెద్దగా పట్టించుకోవడం లేదు. 2019తో పోలిస్తే ఈ ఐదేళ్లలో జిల్లాలో ద్విచక్ర వాహనాలు రెట్టింపు అయ్యాయి. వాహనాలకు తగ్గట్టుగా రోడ్లు, కూడళ్ల విస్తరణ జరగడం లేదు. ఫలితంగా ప్రమాదాల శాతం పెరుగుతోంది. శిరస్త్రాణం ధరించని వారి లైసెన్సులు సైతం రద్దు చేస్తామని ప్రకటించి హెల్మెట్ తప్పనిసరి చేయాలి. అప్పుడే కొంతమేర ప్రమాదంలో మరణాల సంఖ్యను తగ్గించవచ్చు.

గత మూడేళ్లలో ఉమ్మడి జిల్లాలో ప్రమాదాలను పరిశీలిస్తే..

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021	940	320	640
2022	725	262	760,
2023	694	277	780

హెల్మెట్ ధరించకపోవడం, ఎంవీఐ కేసుల వివరాలు ఇలా..

సంవత్సరం	ఎంవీఐ కేసులు	జరిమానా
2021	3,34,216	రూ.7,55,33,726
2022	2,01,382	రూ.7,89,90,739
2023	3,24, 777	రూ.8.60,70,204

2024 జనవరి నుంచి ఆగస్టు వరకు 42,749 కేసులు నమోదు కాగా, రూ.1,60,76,924 జరిమానా వసూలు చేశారు.

హెల్మెట్ ధరించేలా కౌన్సెలింగ్ ఇస్తాం



జరిమానాలు కాదు ప్రజల్లో అవగాహన రావాలి. వాహన తనిఖీలు పోలీసుల కోసం చేసేది కాదు. మా భద్రత కోసమే అన్న ఆలోచన రావాలి. ఏదో పోలీసులు పట్టుకున్నారు, జరిమానా కట్టేశాం, లేదా తప్పించుకుని వచ్చేశాం అనే విధానం మారాలి. పోలీసులు చేసే తనఖీలు తమ కోసమే అని వాహనచోదకులు గ్రహించాలి. దీనిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రహదారి ప్రమాదాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రమాదాలపై ఉదాసీనంగా ఉండవద్దని, హెల్మెట్ ధారణ తప్పనిసరిగా ఆచరించేలా చర్యలు తీసుకోవాలని తీర్మానించింది.

– వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ డీఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

పొట్టిలంక-కడియపులంక మధ్య కెనాల్ బోటింగ్

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- క్షేత్రస్థాయి పరిశీలన



పొట్టిలంక-కడియపులంక మధ్య కెనాల్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి, పర్యాటక శాఖ అధికారులు

కడియం: జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధి ప్రణాళికలో భాగంగా కడియం మండలం పొట్టిలంక గ్రామం నుంచి కడియపులంక వరకు బోటు విహారానికి క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శనివారం ఉదయం పర్యాటకశాఖ అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో ఆమె పర్యటించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు ముందుగానే ఈ ప్రాంతంలో పర్యాటకపరంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం పబ్లిక్, ప్రవేటు భాగస్వామ్యంతో ప్రతిపాదన సిద్ధం చేయాలన్నారు. అందులో భాగంగా సుందరీకరణ, గ్రీనరీ, ఆర్చింగ్ పాయింట్స్, రెస్టారెంట్ తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఎకో టూరిజం అభివృద్ధికి ఇటీవల పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కడియం నర్సరీ ప్రతినిధులతో సమావేశమయ్యారని, ఈ మేరకు కెనాల్‌లో బోటింగ్‌కు ప్రతిపాదనలను, డీపీఆర్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట పర్యాటక శాఖ ఆర్‌జేడీ వి.స్వామి నాయుడు జిల్లా టూరిజం అధికారి పి.వెంకటాచలం, తహసీల్దార్ కె.పోసిబాబు తదితరులు ఉన్నారు.

ఇసుక రవాణాకు వాహనాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లా స్థాయి కమిటీలో ఆమోదించిన ధరలను అనుసరించి స్లాట్ నమోదు చేసే సమయంలో ఇసుక రవాణా చార్జీలను వసూలు చెయ్యాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో కొవ్వూరు ఆర్డీఓ, రాజమహేంద్రవరం, మైన్స్, ఇరిగేషన్, మున్సిపల్ కమిషనర్ కార్యాలయ సిబ్బంది, నిడదవోలు, పెరవలి తహసీల్దార్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, మైన్స్ ఏడీఎం సుబ్రహ్మణ్యం తదితరులతో కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక రవాణాలో అధిక చార్జీలు వసూలును నియంత్రించే క్రమంలో ముందుగా రవాణా వాహనాలను గుర్తించి ధ్రువీకరించాల్సింది జిల్లా రవాణా అధికారులదే అన్నారు. వారి వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలను మాత్రమే అనుమతించడం జరుగుతుందని, ఇప్పటి వరకు 134 లారీలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. వాటి జాబితాను ఇసుక రీచ్ వద్ద, బుకింగ్ పాయింట్ వద్ద అందుబాటులో ఉంచడంతో పాటు, రవాణా చార్జీల పట్టికను పొందుపరుస్తామని తెలిపారు. జిల్లాలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు పర్యవేక్షణ అధికారిగా వ్యవహరిస్తారని కలెక్టర్ తెలిపారు.

18 ఏళ్లలోపు వారికి సత్వర శస్త్రచికిత్సలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పుట్టుకతో వివిధ లోపాలు, వ్యాధులు, కౌమార బాలికల సమస్యలకు జిల్లా సత్వర చికిత్సా కేంద్రం ద్వారా వైద్య సేవలు అందించనున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వాస్పత్రిలో జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సత్వర చికిత్సా కేంద్రం, జిల్లా జాతీయ హెల్త్ మిషన్ అధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు ప్రధాన లోపాలతో బాధపడుతున్న 18 ఏళ్ల లోపు పిల్లలకు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ మేరకు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు తదితర ఆస్పత్రుల వైద్య సిబ్బందికి మూడు రోజుల శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. వారు చిన్నారులకు పరీక్షలు చేసి గ్రహణం మొర్రి, వంకరపాదాలు, రక్తహీనత, సాంక్రమిక కంటిపొర, పుట్టుకతో వచ్చే చెముడు దృష్టి లోపం తదితర సమస్యలకు చికిత్స అందిస్తారన్నారు. అప్పటికీ నయం కాకపోతే జిల్లా సత్వర చికిత్సా కేంద్రానికి పంపుతారని, అక్కడ కూడా కుదరకపోతే సూపర్‌స్పెషాలిటీ వైద్యాం నిమిత్తం గుంటూరు, విజయవాడ, తిరుపతి, చెన్నై వంటి నగరాల్లోని ఆస్పత్రులకు రిఫర్ చేస్తారని తెలిపారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లోని విద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు ఆదివారం కూడా పనిచేస్తాయని ఏపీ ఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కె.తిలక్ కుమార్ శనివారం ప్రకటించారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు, ఏపీ ఈపీ డీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో కూడా ఈ ఆదివారం చెల్లించవచ్చునని తెలిపారు.

సత్తెమ్మ తల్లికి వెండి కిరీటం సమర్పణ



అమ్మవారి వెండి కిరీటం అందిస్తున్న దాతలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులోని జవ్వలదొడ్డిలో కొలువైన ఉన్న సత్తెమ్మతల్లికి వెండి కిరీటాన్ని దాతలు సమర్పించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం గ్రామానికి చెందిన కురాకుల పెద్దకాపు, సూర్యవతి దంపతులు, దాసరి సత్యనారాయణ, సీత దంపతులు సంయుక్తంగా రూ.60 వేల విలువైన వెండి కిరీటాన్ని అమ్మవారికి అందించారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి మూల విరాట్‌కు అలంకరించారు.

క్లుప్తంగా

నీట్ పీజీ ఫలితాల్లో ప్రతిభ


గంగుల కీర్తి

మలికిపురం: ఆల్ ఇండియా నీట్ పీజీ ఫలితాల్లో మండలంలోని గూడపల్లికి చెందిన గంగుల కీర్తి 1654వ ర్యాంకు సాధించింది. ఈ మేరకు ఆమెను గ్రామ సర్పంచ్ సుందర తాతాజీ, ఎంపీటీసీ సుందర శ్రీనివాసరావు, సుందర బ్రహ్మయ్య తదితరులు అభినందించారు.

స్వగ్రామానికి యువకుడి మృతదేహం


నాగసాయి (ఫైల్)

మామిడికుదురు: బహ్రెయిన్‌లో ఆత్మహత్య చేసుకున్న పెదపట్నంలంక శివారు దుర్గపట్నానికి చెందిన నాగులాపల్లి వీర వెంకట దుర్గానాగసాయి (22) మృతదేహం శుక్రవారం రాత్రి స్వగ్రామానికి చేరింది. మృతదేహాన్ని చూడగానే తల్లి అనంత లక్ష్మి, చెల్లి భానులక్ష్మి, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. సాయి గత నెల 29న ఉపాధి కోసం బహ్రెయిన్ వెళ్లాడు. అక్కడ ఓ పెట్రోలు బంకులో పనిచేస్తూ ఈ నెల 17న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి



కొవ్వూరు: దేచెర్ల గ్రామ సమీపంలోని చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరపల్లి మండలం గౌరీపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు బడుగు రాజారత్న (47) మృతి చెందారు. ఏడాదిన్నర కుమార్తెకు అనారోగ్యంగా ఉండడంతో సెలవులో ఉన్న ఆమె శనివారమే విధులకు హాజరయ్యారు. అయితే కుమార్తె ఏడుస్తోందని సమాచారం రావడంతో స్వస్థలమైన రాజమహేంద్రవరం బయలుదేరారు. గౌరీపట్నంలో ఎక్స్‌ప్రెస్‌లు ఆపకపోడంతో ఐ.పంగిడి వెళ్లి రాజమహేంద్రవరానికి బస్సు ఎక్కాలని భావించారు. అదే పాఠశాలలో ఉపాధ్యాయుడు కేదాటి ఫణిశేఖర్‌ను సాయం కోరడంతో ఆయన రాజారత్నను తీసుకుని మోటారుసైకిల్‌పై ఐ.పంగిడి బయలుదేరారు. దేచెర్ల చెరువు సమీపంలో బురద మట్టి కారణంగా వాహనం అదుపు తప్పింది. దీంతో ఇద్దరూ కిందపడిపోయారు. ఆ సమయంలో వెనుక వస్తున్న లారీ.. రాజారత్న తలపై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. రాజారత్న భర్త రాజేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై కర్రి శ్రీహరిరావు తెలిపారు.



రక్షణ ఏర్పాట్లు చేయాలి

ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నైటీ డ్యూటీలు చేసే మహిళా డాక్టర్లకు ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేయాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను చూస్తుంటే రాత్రి సమయంలో ఆస్పత్రుల్లో విధులు నిర్వహించాలంటేనే భయంగా ఉంటోంది. మహిళా డాక్టర్లు, నర్సులతో ఒక రకమైన అభద్రతా భావం ఏర్పడింది. వారిలోని ఈ భయాన్ని, ఆందోళనను పోగొట్టే దిశగా ప్రభుత్వాలు పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ సౌమ్య పసుపులేటి, మానసిక వైద్య నిపుణురాలు, అమలాపురం ఏరియా ఆస్పత్రి





భరోసా కల్పించాలి

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘటన చాలా దారుణం. అక్కడ డ్యూటీ డాక్టర్‌కు రూమ్ కూడా లేకపోవడం బాధాకరం. ఈ ఘాతుకానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలి. అలాగే ప్రతి ఆస్పత్రికి ప్రత్యేక రక్షణ వ్యవస్థ ఉండాలి. కొందరు మద్యం తాగి ఆస్పత్రికి వచ్చి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. నైట్ వాచ్‌మెన్‌తో పాటు ఒక కానిస్టేబుల్‌ను నియమించాలి. అప్పుడు వైద్య సిబ్బంది భరోసా కలుగుతుంది.

– డాక్టర్ మోటూరి వీరదుర్గాకుమారి, గైనకాలజిస్టు, కొత్తపేట

సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి బాబూ..

- జగన్‌ను విమర్శించే అర్హత మీకు లేదు
- ఉచిత ఇసుక పేరిట తెలుగు తమ్ముళ్ల దందా
- మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ధ్వజం


రావులపాలెంలోని మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం/ఆలమూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి బాబూ అని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై లేనిపోని విమర్శలు చేస్తూ తన స్థాయిని మరింత తగ్గించుకుంటున్నారన్నారు. రావులపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగ్గిరెడ్డి మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో అప్పటి సీఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మేరకు దాదాపు 98.5 శాతం నెరవేర్చారన్నారు. ఆ విషయాన్ని చంద్రబాబు మర్చిపోవడం దారుణమన్నారు. కొత్తపేట మండలం వానపల్లిలో నిర్వహించిన గ్రామసభలో సీఎం చంద్రబాబు ఇష్టానుసారం మాట్లాడి పరువు పోగొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. గ్రామ సభలు నిర్వహించడం కొత్తేమీ కాదని, గత ప్రభుత్వ హయాంలోనూ ఏటా గ్రామసభలు నిర్వహించిన సంగతిని గుర్తు చేశారు. నియోజకవర్గాన్ని గడచిన ఐదేళ్లలో రూ.3 వేల కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశానన్నారు. వానపల్లిలోనే వివిధ పథకాల ద్వారా రూ.42 కోట్ల లబ్ధిని ప్రజలకు చేకూర్చామన్నారు. గ్రామ దేవత పళ్లాలమ్మ ఆలయ ఆవరణలో రూ.1.60 కోట్లతో ముఖ మండపాన్ని నిర్మించామని, నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 17,500 మందికి ఇళ్ల పట్టాలను అందజేశామని, లంక భూములు నదీకోతకు గురి కాకుండా గ్రోయిన్లు నిర్మించామన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులు నష్టపోతే.. అదే సీజన్‌లో పరిహారం అందించిన ఘనత మాజీ సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు.

అబద్ధాలమయం

టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాజకీయ ప్రస్థానం అంతా అబద్ధాలమయమని జగ్గిరెడ్డి విమర్శించారు. అలాగే మంత్రి లోకేష్ కూడా తాత, తండ్రి పేర్లు చెప్పుకోనిదే రాష్ట్రంలో రాజకీయం చేయలేని దుస్థితిలో ఉన్నారన్నారు. మాజీ సీఎం జగన్ మాత్రం ప్రజల్లోంచి పుట్టారన్నారు. ఆయనను విమర్శించే నైతిక హక్కు చంద్రబాబుకు లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను చంద్రబాబు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో చంద్రబాబు నాయుడు భారీ అవినీతికి పాల్పడ్డారని జగ్గిరెడ్డి అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిధులను అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏటీఎంగా వాడుకుందన్నారు. ఆ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సైతం చంద్రబాబు విమర్శించారని గుర్తు చేశారు.

ఉచిత ఇసుకపై బి ట్యాక్స్

భవన నిర్మాణ కార్మికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్త చర్యగా వర్షాకాలంలో ఉపయోగించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఇసుక నిల్వలను ఉచితం పేరిట బి ట్యాక్స్‌ను వసూలు చేసి తెలుగు తమ్ముళ్లు తినేశారని జగ్గిరెడ్డి దుయ్యబట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదు యూనిట్ల పెద్ద లారీ ఇసుకను కేవలం రూ.10 వేలకే విక్రయించామన్నారు. కానీ బి ట్యాక్స్ ప్రభావం వల్ల ఆ ధర రూ. 25 వేలకు పెరిగిందన్నారు. గడచిన రెండున్నర నెలల కాలంలో ఇసుకలో జరిపిన దోపిడీపై సీఎం చంద్రబాబు ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. ఒక్కొక్క ఇసుక లారీ నుంచి బి ట్యాక్స్ కింద రూ.ఆరు వేల వరకూ వసూలు చేయడం ఎంతవరకూ సమంజసమన్నారు. సమావేశంలో అమ్డా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీలు తోరాటి లక్ష్మణరావు, మార్గని గంగాధర రావు, సర్పంచ్‌లు దొమ్మేటి అర్జునరావు, తమ్మన శ్రీనివాసు, మాజీ ఎంపీటీసీ జవ్వాది రవిబాబు, మాజీ జడ్పీటీసీ సాకా ప్రసన్నకుమార్, రాష్ట్ర కార్యదర్శి ముదునూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి హరినారాయణ

కాకినాడ లీగల్: సెప్టెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ బీమా కేసులను పరిష్కరించాలని కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం కోర్టు హాల్లో బీమా కంపెనీ అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. జడ్జి హరినారాయణ మాట్లాడుతూ కక్షిదారులకు కేసు రాజీవల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. సమావేశంలో ఆరో అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీ నిఖిత పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 729 మందికి ఉద్యోగాలు

పిఠాపురం: పట్టణంలోని ఎస్ఎఫ్ఐ స్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాలో 729 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేసినట్లు వికాస పీడీ లచ్చారావు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 2,790 మంది హాజరయ్యారన్నారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ప్రారంభించగా, 40 కంపెనీల నుంచి వచ్చిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

గోకవరం: ప్లాస్టిక్ గోనె సంచుల్లో తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోకవరం ఎస్సై వీఎస్‌వీ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణునిపాలెం పంచాయతీ రామన్నపాలెం జంక్షన్ సమీపంలో వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో బొలెరో వాహనాన్ని వదిలి కొందరు పారిపోయారు. పోలీసులు ఆ వాహనాన్ని పరిశీలించగా సంచులలో ప్యాక్ చేసిన 813.590 కేజీల గంజాయి బయటపడింది. దాని విలువ రూ.40,67,950 ఉంటుందని అంచనా. ఆ వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. నిందితుల ఆచూకీ తెలియాల్సి ఉంది.

27, 28 తేదీల్లో కొబ్బరి జాతీయ సదస్సు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

సాక్షి, అమలాపురం: దేశ వ్యాప్తంగా కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లేందుకు జిల్లాలో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి తెలిపారు. అమలాపురంలో శనివారం బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కుమార స్వామి మాట్లాడుతూ ఈనెల 27, 28వ తేదీల్లో అమలాపురంలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రైతు ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారన్నారు. 27న స్థానిక జనహితలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కారాలు, మార్కెటింగ్ అవకాశాలపై చర్చిస్తామన్నారు. 28న అమలాపురం కిమ్స్ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో రైతులతో సదస్సు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కె.అచ్చెన్నాయుడుతో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్కా ఆదినారాయణ, భారతీయ ఆగ్రో ఎకనామిక్స్ డైరెక్టర్లు తిక్కిరెడ్డి గోపాలకృష్ణ, ఉప్పుగంటి భాస్కరరావు, రైతుమిత్ర రూరల్ టెక్నాలజీ పార్కు కన్వీనర్ అడ్డాల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నిడదవోలు రైల్వేగేటు ధ్వంసం



రైల్వేగేటు విరిగిపోవడంతో ఇరువైపులా నిలిచిన ట్రాఫిక్

నిడదవోలు: స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్‌లోని తాడేపల్లిగూడెం వైపు ఉన్న రైల్వేగేటును శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో గేటు ధ్వంసమైంది. ఆపరేటింగ్ సిబ్బంది గేటుపైకి లేపుతున్న సమయంలో ఈ విషయాన్ని గమనించారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ సమయంలో రైల్వేగేటుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. దాదాపు 40 నిమిషాల పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రైల్వే సిగ్నల్ సిబ్బంది, రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువైపులా తాత్కాలిక గేటులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సమయంలో సిగ్నల్ వ్యవస్థ పని చేయకపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది. టెక్నీషియన్లు అక్కడకు చేరుకుకుని విరిగిపోయిన గేటుకు మరమ్మతులు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గోకవరం: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై గోకవరం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కామరాజుపేటకు చెందిన జట్ల తాసు (54) మంగళవారం పశువులు మేపేందుకు గ్రామ శివారులో నెల్లిపూడి వంతెన వద్దకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. అప్పటి నుంచి అతడి కుమారుడు శ్రీను తన తండ్రి కోసం వెతుకుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం కాలువ బ్రిడ్జి వద్ద మృతదేహం ఉండటాన్ని పశువుల కాపరులు గమనించి, వెంటనే గ్రామస్తులకు సమాచారం తెలియజేశారు. సంఘటనా స్థలానికి గ్రామస్తులు వచ్చి పరిశీలించగా, మృతుడు జట్ల తాసు అని తెలిసింది. తాసు కాలువలోకి దిగిన ప్రదేశంలో ఊబి ఉండటంతో కూరుకుపోయి ఉంటాడని భావిస్తున్నారు. వీఆర్వో వీరబాబు ఫిర్యాదు మేరకు గోకవరం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

మధురపూడి: సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పీఏసీఎస్ మాజీ సీఈవో మలిరెడ్డి శ్రీనివాసరావు (57) మృతి చెందారు. వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లి పది రోజులు చికిత్స తీసుకున్న అనంతరం ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కోదాడ సమీపంలో రోడ్డు పక్కన కారును ఆపి, కాలకృత్యాలకు వెళ్లగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. తలకు తీవ్రగాయమైన ఆయనను కోదాడ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన గోకవరం మండలం రంపయర్రంపాలేనికి తరలించారు. శ్రీనివాసరావు 2019 నుంచి 2022 వరకూ వరకూ శ్రీరంగపట్నం పీఏసీఎస్‌కు సీఈఓగా బాధ్యతలు నిర్వహించారు.